వైసీపీ సభకు బస్సుల తరలింపుతో - తిరుపతి బస్టాండులో ప్రయాణికుల పరిస్థితి


సిద్ధం సభకు మండుటెండలో వెళుతున్న చిన్నారులు





మేమంతా సిద్ధంగా లేం!

- జగన్‌కి తేల్చిచెప్పిన జనం
- వెలవెలబోయిన నాయుడుపేట సభ

ప్రచారసభల్లో పదేపదే మీరు సిద్ధమా..అంటూ జగన్ అడుగుతూ ఉంటారు. వెంటనే కెమెరాలు వేదికకు దగ్గరగా ఒకే ప్రాంతం వైపు మళ్లుతాయి.అక్కడ వ్యూహాత్మకంగా ముందే ఏర్పాటు చేసుకున్నవారు చేతులెత్తి అరుస్తారు. ఉమ్మడి జిల్లాలో మదనపల్లె, పూతలపట్టు సభల్లో ఈ డ్రామా పండినా.. నాయుడుపేట సభలో మాత్రం అడ్డం తిరిగింది. జనం లేక సభ వెలవెలపోగా, వచ్చిన జనం కూడా జగన్ మైకు ముందుకు రాగానే జారుకోవడం మొదలుపెట్టారు. మిగిలిన ఆ కాస్తమందీ పేలవంగా స్పందించారు. ఒక రకంగా జగన్ వెంట నడవడానికి తామంతా సిద్ధంగా లేమని జనం ప్రకటించినట్లు అయ్యింది. ఈ పరిస్థితి చూసిన వైసీపీ నాయకులే.'అయ్యో ఇలా అయిపోయిందేమిటా?' అని దిగులు ముఖాలతో కనిపించారు. గురువారం జగన్ బస్సు యాత్రలోనూ ఇదే సీను రిపీట్ అయ్యింది. మరోవైపు జాతీయ రహదారి మొత్తం స్తంభింపజేసి మండుటెండల్లో ప్రజలకు నకరం చూపించారు. ఐదేళ్ల తర్వాత తొలిసారి తమ ముందుకు వచ్చిన జగన్‌రెడ్డి పాత హామీలు గుర్తు చేసుకుని మంచి మాట ఏదైనా చెప్తాడా అని చూసిన వారు నిరాశ చెందారు. అభివృద్ధి ఊసే లేకుండా యధాప్రకారం తిట్ల దండకాలతోనే ఆయన ప్రసంగం ముగియడం విశేషం.

- రేణిగుంట/ఏర్పేడు/నాయుడుపేట/తడ/శ్రీకాళహస్తి/ పెళ్లకూరు/గూడూరు అర్బన్,ఆంధ్రజ్యోతి


గూడూరులో జగన్ అభివాదం

జగన్ మాట్లాడుతుండగానే ఖాళీగా సభా ప్రాంగణం



81 కిలోమీటర్ల బస్సుయాత్రతో జనానికి నరకం

రేణిగుంట మండలం గురవరాజుపల్లి నుంచి జగన్ గురువారం ఉదయం 10 గంటలకు బయల్దేరి నాయుడు పేటకు సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. ఈ దూరం 53 కిలోమీటర్లు. అలాగే అక్కడ నుంచీ గూడూరు వద్ద జిల్లా సరిహద్దుల వరకూ 28 కిలోమీటర్లు. మొత్తం ఈ 81 కిలోమీటర్ల దూరం సాగిన బస్సు యాత్ర జిల్లా వ్యాప్తంగా వేలాదిమందికి ప్రత్యక్ష నరకం చూపించింది. రేణిగుంటలో సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభం కావడానికి గంటా రెండు గంటల ముందే ట్రాఫిక్ ఆపేశారు. చెన్నై, కడప, నెల్లూరు, తిరుపతి కీలక మార్గాల్లో రెండు గంటల పాటు ట్రాఫిక్ ఆపడంతో వేలాది వాహనాలు కిలోమీటర్ల కొద్దీ ఆగిపోయాయి. బస్సు యాత్ర ప్రారంభమైన అరగంట తర్వాత రాకపోకలకు అనుమతించినప్పటికీ ట్రాఫిక్ జామ్ కావడంతో మరో రెండు గంటల పాటు తీవ్ర అవస్థ పడ్డారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి, పెళ్ళకూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక విజయవాడ-చెన్నై జాతీయ రహదారిపై వేల కొద్దీ వాహనాలు రెండు వైపులా నిలిచిపోయాయి. ఇలా కనీసం నాలుగైదు గంటల పాటు జాతీయ రహదారిపై వాహనాలు చిక్కుకుపోయాయి. రేణిగుంట మండలం రామకృష్ణాపురం కూడలి వద్ద రెండు అంబులెన్సులు ఇరుక్కుపోయాయి. ఓ వాహనం రోగిని తేవడానికి శ్రీకాళహస్తికి వెళుతుండగా మరోటి రోగిని తిరుపతికి తీసుకెళుతూ గంటల కొద్దీ చిక్కుకుపోయింది. వేసవిలో ఎండ ధాటికి తోడు ఉక్కపోతకు వాహనాల్లోని జనం నరకయాతన అనుభవించారు.

జనమేరి నాయకా?

నాయుడుపేట సభకు జిల్లావ్యాప్తంగా భారీగా జనాన్ని సమీకరించాలని అధికార పార్టీ నేతలు చేసిన ప్రయత్నం విఫలమైంది. గత మంగళవారం నుంచే సిద్ధం సభల కోసం 250 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. అవి మదనపల్లె, పూతలపట్టు సభలకు జనాన్ని తరలించే పనిలో బిజీగా నడిచాయి. గురువారం వాటిని నాయుడుపేట సభకు మళ్లించారు. అయితే ఆ బస్సులు సరిపోవని భావించి బుధవారం అర్ధరాత్రి అదనంగా మరో 150 బస్సులు కేటాయించారు. మొత్తం 400 బస్సులు కేటాయించినా సభకు జనం రాలేదు. సభ వేదికపైకి జగన్ చేరుకునే సమయానికి కేవలం ముందువైపు గ్యాలరీల్లో మాత్రమే కార్యకర్తలు వున్నారు. ముప్పావు వంతు గ్యాలరీలు ఖాళీగా కనిపించాయి. జగన్ వేదికపైకి రావడంతో సభ వెలుపల, రోడ్లపై వున్న కార్యకర్తలను, ప్రజలను లోనికి వెళ్ళాలంటూ పోలీసులు బతిమాలారు.జగన్ మాట్లాడడం మొదలుపెట్టిన పది నిమిషాల నుంచే ముందు వరుస గ్యాలరీల్లో పలచగా వున్న జనం కూడా బయటకు జారుకోవడం మొదలు పెట్టారు. ఇప్పటి వరకూ జరిగిన జిల్లాస్థాయి మేమంతా సిద్ధం సభల్లో ఇంతగా ఫెయిలైన సభ మరోటి లేదని పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది.

హామీలు మరిచిన జగన్

గత ఎన్నికల్లో జిల్లా ప్రజలకు తానిచ్చిన హామీలను సభలో జగన్ ఏమాత్రం ప్రస్తావించలేదు. 2018లో పాదయాత్రలోనూ, 2019 ఎన్నికల ప్రచారంలోనూ జగన్ జిల్లా ప్రజలకు అనేక హామీలిచ్చారు. గాలేరు-నగరి, ఎస్‌ఎస్ కెనాల్ ప్రాజెక్టులు పూర్తి చేస్తానని, గాజులమండ్యం చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తానని, మన్నవరం బెల్-ఎన్టీపీసీ ఫ్యాక్టరీ తెరిపిస్తానని, పులికాట్ సరస్సులో పూడిక తొలగిస్తామని.. ఎన్నో హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. వాటి గురించి ప్రస్తావించలేదు. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పులికాట్ పూడిక తీత వంటి సమస్యలు ప్రస్తావించినా జగన్ వినిపించుకోలేదు. దానిపై స్పందించలేదు. దీంతో ఇటు వైసీపీ కార్యకర్తలు, అటు ప్రజలు కూడా తీవ్ర నిరాశకు, అసంతృప్తికి లోనయ్యారు.

శ్రీకాళహస్తి నేతల అత్యుత్సాహం

జనాన్ని ఇబ్బంది పెట్టి మరీ ఇన్నేసి బస్సులను మళ్లించినా నాయుడుపేట సభ ఎందుకు పలచబారిపోయిందా అని ఆరా తీస్తే.. శ్రీకాళహస్తి వైసీపీ నేతలు వాటిలో ఎక్కువ తమ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్ళకు జనాన్ని చేరవేయడానికే పరిమితం చేసుకున్నారని తెలిసింది. రేణిగుంట మండలం గురవరాజుపల్లి వద్ద జగన్ రాత్రి బస చేసిన చోటకు 500 మంది మహిళలను బస్సుల్లో ముందే రప్పించి, ఆయన్ను చూడడానికి నిరీక్షిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చారు. గంటన్నరకు పైగా అక్కడే పడిగాపులు కాసిన మహిళలకు కనీసం నిలువ నీడ కూడా లేకపోయింది. ఏర్పేడు మండలంలో ఒకటి రెండు చోట్ల మహిళా రైతులు, పెన్షనర్లు అయిన వృద్ధులను కూడా స్థానిక వైసీపీ నేత ఏర్పాటు చేశారు. అక్కడ బస్సు ఆపించి సీఎం జగన్ కిందకు దిగి వారితో మాట్లాడేలా ముందస్తు ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలో మొత్తం 1100 ఆర్టీసీ బస్సులుండగా వాటిలో 400 బస్సులు సిద్ధం సభకు కేటాయించారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లలో బస్సుల కొరత కొట్టొచ్చినట్లు కనిపించింది.

ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్



కార్యకర్తలున్న చోట్ల ఆగని బస్సు

ఏర్పేడు మండల కేంద్రంలో స్థానిక నేతలు, కార్యకర్తలు రెండు గంటల నుంచీ పడిగాపులు కాశారు. భారీగా స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసుకున్నారు. అయితే బస్సు ఆపకుండా జగన్ లోపలి నుంచీ అభివాదం చేస్తూ ముందుకు వెళ్ళిపోవడంతో వీరంతా తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు. పలుచోట్ల కూడా ఇలానే జరిగింది. ముందే నిర్ణయించుకున్న చోట్ల తప్ప మరెక్కడా జగన్ బస్సు ఆగలేదు.

క్రేన్‌కి వేలాడినా..

ఏర్పేడులోనే ఓ కార్యకర్త క్రేన్ సాయంతో భారీ గజమాల వేసేందుకు ఏర్పాటు చేసుకున్నారు. జగన్ బస్సు సమీపించగానే క్రేన్ కొక్కీ వద్ద ఆ కార్యకర్త గాల్లో వేలాడుతూ మాల వేసేందుకు సంసిద్ధమయ్యాడు. అయితే బస్సు ఆపినా జగన్ మాత్రం కిందకు దిగలేదు. దీంతో క్రేన్ సాయంతో ఆ కార్యకర్త గజమాలను బస్సు పైభాగంలో తాకించి సంతృప్తి పడాల్సి వచ్చింది. ఇంత ప్రమాదకర ఫీట్ చేసిన ఆ కార్యకర్తను వైసీపీ నేతలు గానీ పోలీసులు గానే వారించకపోవడం విమర్శలకు దారి తీసింది.

డ్రైవర్లు తక్కువ.... యజమానులే ఎక్కువ

బస్సు యాత్రలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం వద్ద సీఎం జగన్ లారీ, ఆటో డ్రైవర్లతో ముఖాముఖీ సమావేశమయ్యారు. ఈ సమావేశం డ్రైవర్ల పేరిట జరిపినా నిజానికి హాజరైన వారిలో లారీ, ఆటో డ్రైవర్లు చాలా తక్కువ. వాటి యజమానులే ఎక్కువగా కనిపించారు. సమావేశంలోకి జగన్ రాకముందే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ పాత్రికేయులను స్థానిక నేతల ద్వారా గుర్తించి బయటకు పంపించేశారు. సమావేశం పేరుకు ముఖాముఖీ అయినా వారితో ముఖాముఖీ మాట్లాడిందేమీ లేదు. వారి చేతికి మైక్ ఇవ్వడంతో ఎక్కువమంది జగన్‌ను పొగిడేందుకే సమయం వెచ్చించారు. ఒకరిద్దరు సమ్యలు ప్రస్తావించినా జగన్ వాటిని వినిపించుకోనట్టుగా మిన్నకుండిపోయారు తప్పితే స్పందించలేదు. ఓ ఆటో డ్రైవర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్కూలు పిల్లలకు ఏటా ఉచితంగా యూనిఫామ్ ఇస్తున్న విధంగా తమకు కూడా ఏడాదికి రెండు జతలు యూనిఫామ్ అందజేయాలని కోరగా ఆ మాటలను జగన్ వినిపించుకోనట్టుగా వుండిపోయారు. సూచనల పెట్టెలు రెండు ఏర్పాటు చేశామని, ఎవరైనా సలహాలు, సూచనలు చేయదలిస్తే స్లిప్పులో రాసి ఆ పెట్టెల్లో వేస్తే తాను తర్వాత పరిశీలిస్తానంటూ చెప్పి నిష్క్రమించారు.



సిద్ధం సభకు వెళుతున్న చిట్టమూరు మండలం తాడిమేడు అంగన్‌వాడీ ఆయా

వైసీపీ విషప్రచారాలతో
కొనసాగిన పింఛను కష్టాలు

- సచివాలయాల వద్ద పండుటాకుల పడిగాపులు


రేణిగుంటలో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి ఆటోలోనే పింఛను అందజేసేందుకు వలంటీరు యత్నం

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 4:మండే ఎండలు ఒక వైపు.. సచివాలయాలకు వెళ్లకపోతే పింఛను రాదేమోనన్న వైసీపీ విష ప్రచారాలతో భయం మరోవైపు...వెరసి కళ్లు సరిగా కనిపించకపోయినా, నడవడానికి కాళ్లు సహకరించకపోయినా వృద్ధులు సచివాలయాల వద్ద రెండవ రోజైన గురువారం కూడా పడిగాపులు కాశారు.పింఛన్లకు వలంటీర్లను దూరం చేస్తూ ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు వైసీపీ కుటిలయత్నం చేస్తోంది. టీడీపీ వల్లనే ఈ కష్టాలంటూ నమ్మించేందుకు పండుటాకులను ఇబ్బంది పెడుతోంది. 'పింఛను కోసం ఇప్పుడే వచ్చేయండి. శుక్రవారమే ఆఖరు. ఆ తర్వాత ఇవ్వరు. ఇప్పుడొచ్చి తీసుకోకుంటే ఈ నెల పింఛను పోయినట్లే' అంటూ పెన్షన్‌దారుల జాబితా పక్కనపెట్టుకుని కొందరు వలంటీర్లు, నేతల ద్వారా ఫోన్లు చేయిస్తున్నారు. దీంతో ఎక్కడ తమకు పింఛను రాకుండా పోతుందోనన్న ఆందోళనతో గురువారం ఉదయాన్నే అందరూ ఒక్కసారిగా సచివాలయాలకు చేరుకున్నారు. దివ్యాంగులకు, అనారోగ్యంతో మంచంపట్టినవారికి, వీల్‌చైర్‌లో ఉన్నవారికి ఇళ్ల వద్దకే వచ్చి పింఛను అందజేయాలని ఆదేశాలున్నా అటు పంచాయతీ, ఇటు సచివాలయ ఉద్యోగులు రాకపోవడంతో మండుటెండలో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు కుటుంబీకుల సాయంతో వచ్చి నిరీక్షించారు.అయితే ఉదయం11గంటల తరువాతే పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. పింఛనుదారులకు సరిపోయే సొమ్ము లేకపోవడంతో సచివాలయ సిబ్బంది కూడా బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది.గురువారం 2,38,000 మందికి పింఛన్లు అందజేసినట్లు డీఆర్డీఏ అధికారులు వెల్లడించారు.


వరదయ్యపాళెం మండలం పెద్దపాండూరు సచివాలయం వద్ద ఉదయం నుంచే పింఛను కోసం వేచివున్న వృద్ధులు

పిల్లలు,మహిళలపై
వైసీపీ కార్యకర్తల దాడి

ఓజిలి, ఏప్రిల్ 4 : ఓజిలి మండలం రాచపాళెం వద్ద గురువారం గ్రామానికి చెందిన అరుంధతీయులపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం హేయమని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. చిన్నపిల్లలు, మహిళలు అని కూడా చూడకుండా దాడి చేసిన వారిని పోలీసులు వెనకేసుకు రావడాన్ని ఖండించారు. దళితులపై వైసీపీ చేయిస్తున్న దాడులకు ఈ చర్యలు పరాకాష్ట అన్నారు. ఈ సంఘటనపై బాధితులు తెలిపిన వివరాల మేరకు.. జయంపు నుంచి సిద్ధం సభకు వైసీపీ కార్యకర్తలు వెళుతున్న బస్సు ఒకటి రాచపాళెం వద్దకొచ్చేసరికి ఓ గోతిలో దిగింది. దీంతో బస్సు అద్దం చిట్లింది. ఆ సమయంలో రోడ్డు పక్కన ఆడుకుంటున్న చిన్న పిల్లలు బస్సుపై రాళ్లతో దాడి చేశారంటూ.. వైసీపీ కార్యకర్తలు వాహనం దిగొచ్చి వారిని కొట్టారు. సమీపంలోని పిల్లల తల్లులు దీన్ని గమనించి ఎందుకు కొట్టారంటూ.. నిలదీయడంతో వారిని కూడా దుర్భాషలాడుతూ, అవమానించారు. దీంతో వైసీపీ కార్యకర్తలు క్షమాపణ చెప్పి వెళ్లాల్సిందేనని, అక్కడి అరుంధతీయులంతా కలిసి బస్సును అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఓజిలి ఎస్‌ఐ రవిబాబు సంఘటన స్థలానికి చేరుకుని సర్దుబాటు చేసి, బస్సును పంపేశారు. అయితే వైసీపీ కార్యకర్తలపై ఎలాంటి కేసు నమోదు చేయక పోవడంతో సాయంత్రం రాచపాళెం అరుంధతీయులు మహిళలు, పురుషులు సుమారుగా 70 మంది పోలీసు స్టేషనుకు వెళ్లారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

31మంది వలంటీర్ల రాజీనామా

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4: మరో 31మంది వలంటీర్లు రాజీనామా బాటపట్టారు.వైపీపీ నేతల ఒత్తిళ్లతో చాలామంది వలంటీర్లు రాజీనామాలు చేసి వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్న విషయం తెలిసిందే.జిల్లావ్యాప్తంగా గురువారం నాటికి 67 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు సమాచారం.వీరిలో గురువారమే కోట మండలంలో 24 మంది,ఏర్పేడులో ఐదుగురు,పుత్తూరు ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారు.ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు, ఇతర డివైజర్లతో పాటు వారి పరిధిలో 50 కుటుంబాల సమగ్ర సమాచారాన్ని, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పుస్తకాలను అధికారులకు తిరిగివ్వాల్సివుంది. అయితే వాటిని వెనక్కు ఇవ్వడంలేదన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

కొత్త కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకారం



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4: తిరుపతి జిల్లా కలెక్టర్‌గా 2006వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎస్‌హెచ్ ప్రవీణ్‌కుమార్ గురువారం రాత్రి ఒంటిగంటకు బాధ్యతలు చేపట్టారు.డీఆర్వో కిషోర్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఏపీఐఐసీ వైస్ చైర్మన్,ఎండీగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ గతంలో విశాఖ, ప్రకాశం జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు.

మము కాపాడు ముత్యాలమ్మా..!

చిల్లకూరు, ఏప్రిల్ 4: మము కాపాడు ముత్యాలమ్మా.. అంటూ భక్తుల ప్రార్థనలు మిన్నంటాయి. చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు గురువారం రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాలనుంచి భక్తులు తరలి వచ్చారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. గురునాథస్వామి, అంకమ్మలకు గ్రామోత్సవం వైభవంగా జరిగింది.


గురునాథస్వామి, అంకమ్మల గ్రామోత్సవం

చంద్రగిరి అభివృద్ధి కోసం నానీని గెలిపించండి



రామచంద్రాపురం, ఏప్రిల్ 4: రానున్న ఎన్నికల్లో చంద్రగిరి అభివృద్ధి కోసం పులివర్తి నానీని గెలిపించాలని టీడీపీ నాయకులు పులివర్తి వినీల్ కోరారు. మండలంలోని గంగిరెడ్డిపల్లి, పరమాలపల్లె గ్రామా ల్లో 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్ధన చౌదరి, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, ఢిల్లీనాథరెడ్డి, మధుసూదన రెడ్డి, సురేంద్రనాయుడు, దినేష్‌నాయుడు, మండల నాయకులు గిరినాయుడు, ప్రసాద్, జీవరత్నం, మునెయ్య, మోహన్, గోపి, వాసుయాదవ్, చెంచురామరెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు పుష్పాభిషేకం



చంద్రగిరి, ఏప్రిల్ 4: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం పుష్పయాగ మహోత్సవం జరిగింది.ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పుష్పయాగం కన్నులపండువగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాష్ట్రాల నుంచి దాతలు పంపిన 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో సుమారు మూడున్నర టన్నుల పుష్పాలతో వేద పండితులు పుష్పార్చన నిర్వహించారు.డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్,, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, మేనేజర్ జనార్ధనరెడ్డి, అర్చకులు శేషాద్రిచార్యులు, బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతను అలవరుచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వీసీ భారతి, చిత్రంలో రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 4: ఈ తరం యువత సామాజిక బాధ్యతను అలవరుచుకోవాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి కోరారు. రెండు రోజులుగా ఆ వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ నిర్వహించిన విరించి-2కె24 ముగింపు సభ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ తక్కువ కాలంలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపును పద్మావతి యూనివర్సిటీ పొందిందన్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థినులు రాణించేందుకు తోడ్పడుతున్నామన్నారు. విద్యాపీఠం వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లోని ఔన్నత్యాన్ని గుర్తించి పాటించాలన్నారు. సాహిత్యం, కళల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. పద్మావతి వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

జేఈఈ మెయిన్స్ రెండో దశ పరీక్షలు ప్రారంభం

తిరుపతి(విద్య), ఏప్రిల్4: జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో దశ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో తిరుపతి కేంద్రంగా జూపార్క్ రోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు తొలిరోజు 1,412మంది విద్యార్థులకు గాను 1,249మంది హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ టికైలాష్‌నాథ్ పేర్కొన్నారు. 163మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

శ్రీరామ కళాశాలలో తరంగ్-2కే24

తిరుపతి (విద్య), ఏప్రిల్ 4 : కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తరంగ్-2కే24 పేరిట నిర్వహించిన ఈ రెండ్రోజుల కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా వచ్చిన బెంగళూరుకు చెందిన హెక్సావేర్ టెక్నాలజీస్ సంస్థ హెచ్ఆర్ మేనేజర్ సౌగతసెన్‌తో కలిసి ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. సౌగతసెన్ మాట్లాడుతూ చదువుతోపాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు పెంచుకోవాలని తెలిపారు. సినీ ప్లేబ్యాక్ సింగర్స్ అరుణ్‌కౌండిన్య, సాయిశిల్ప పలు సినీ గీతాలను ఆలపించి అలరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడాపోటీలు, అకడమిక్స్‌లో ప్రతిభచాటిన విద్యార్థులు, అధ్యాపకులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

మేమంతా సిద్ధం సభకు భారీగా తరలిన మద్యం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4 : తొట్టంబేడు మండలం చిన్న సింగనమాలలో గురువారం జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమానికి ఆ పార్టీ నేతలు తిరుపతి నుంచి బస్సుల్లో మద్యం తరలించారు. ఎక్సైజ్ అధికారుల నిబంధనల మేరకు బార్ల నుంచి ఒక బాటిల్ కూడా బయటకు తీసుకెళ్లడానికి వీల్లేదు. కానీ అధికార పార్టీ నాయకులు కావడంతో అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. తిరుపతిలోని లీలామహల్, శివజ్యోతి నగర్, మధురానగర్, అశోక్‌నగర్ ప్రాంతాల నుంచి బయలుదేరిన బస్సుల్లో సమీపంలోని బార్ల నుంచి మద్యం కేసులు తీసుకెళ్లి బస్సుల్లో ఉంచడం కనిపించింది. ముందుగానే ఆర్డర్లు పెట్టి కొని స్టాకు పెట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై ఎక్సైజ్ ఎస్ఐ వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా దీనిపై విచారణ జరిపిస్తానని అన్నారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం జరుగనుంది. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం మీటింగ్ హాల్‌లో ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో ధర్మారెడ్డితో నేరుగా మాట్లాడవచ్చు. ఇందుకోసం 0877 2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

పింఛను కోసం వెళుతూ వృద్ధుడి మృతి

ఏర్పేడు, ఏప్రిల్ 4 : పింఛను కోసం వెళుతూ ఓ వృద్ధుడు చనిపోయాడు. ఏర్పేడు మండలం కందాడ సచివాలయ పరిధిలోని సదాశివపురం గ్రామానికి చెందిన కురసకోల వెంకటరాజు (75) పింఛను కోసం కందాడకు వెళుతుండగా ఎండవేడికి తాళలేక మార్గమధ్యంలో సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు చూసే సమయానికి మృతి చెందాడు.వెంకటరాజుకు భార్య, పిల్లలు లేకపోవడంతో మేనల్లుడైన రవిరాజు వద్ద వుండేవాడు.

బోధనేతర ఉద్యోగుల ఎన్నికలు నిర్వహించండి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో తిరుపతి కేంద్రంగా నడిచే ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో బోధనేతర ఉద్యోగులకు సంబంధించిన ఎన్నికలను సకాలంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి కె.బాలకార్తీక్ పేర్కొన్నారు. ఈ మేరకు సంఘ ఆధ్వర్యంలో గురువారం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుత కార్యవర్గ రెండేళ్ల కాలపరిమితి ఈనెల 25వ తేదీతో ముగుస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సి.మునీంద్రారెడ్డి, బి.మహేష్, నాగరాజ, మనోహర్, వెంకటేష్ బాబు, ఉమాదేవి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుండెనొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐటీడీపీ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంను టీడీపీ నేతలు ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్ పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష అందజేశారు. పార్టీ నగర కార్యదర్శి మహేష్, రఘురాం, అబ్దుల్లా, మునికృష్ణయ్య వారి వెంట ఉన్నారు.

పద్మావతి అమ్మవారి ఆలయంలో 9న ఉగాది వేడుకలు

● పుష్పపల్లకిలో అమ్మవారి దర్శనం

తిరుచానూరు, ఏప్రిల్ 4: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 9వ తేదీ మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం శ్రీకృష్ణ స్వామి ముఖమండపంలో అమ్మవారి ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు అమ్మవారు పుష్పపల్లకిలో నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. రాత్రి 8గంటల వరకు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయంలో జరిగే పలు ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ దర్శనాలు, కుంకుమార్చన, ఊంజల్‌సేవను టీటీడీ రద్దుచేసింది.

ప్రాంగణ ఎంపికల్లో 34మందికి ఉద్యోగాలు

రామచంద్రాపురం, ఏప్రిల్ 4: మండలంలోని వెంకట్రామాపురం సమీపంలో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో గురువారం సినర్జీ రెమెడీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 34మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు తెలిపారు. సినర్జీ రెమెడీస్ సంస్థ తరపున జగదీశ్వర్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి విద్యార్థులకు రాతపరీక్ష, మౌఖిక, వ్యక్తిత్వ పరీక్షలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు.

ఒక్క అవకాశం ఇవ్వండి...అభివృద్ధి చేసి చూపిస్తా!

పులివర్తి నాని ● టీడీపీలో చేరిన చిన్నగొట్టిగల్లు వైస్ ఎంపీపీ కుటుంబం



టీడీపీలో చేరిన వారితో పులివర్తి నాని

భాకరాపేట, ఏప్రిల్ 4: ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానని చంద్రగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం వైస్ ఎంపీపీ సునీత, ఆమె భర్త దామోదరం, మోహన్‌లతో పాటు భారీ సంఖ్యలో కుటుంబాలు గురువారం నాని సమక్షంలో టీడీపీలో చేరారు. అంతకుముందు భాకరాపేట ఘాట్ రోడ్డులోని పెట్రోలు బంకు నుంచి భారీ స్కూటర్ ర్యాలీగా వచ్చి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బజారు వీధిలో ప్రజలకు అభివాదం చేస్తూ సభాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ తలకోన వృథా జలాలతో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల ప్రజలు, రైతులకు ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తానన్నారు. రెండు మండలాలకు మార్కెట్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. రైతుల ప్రయోజనం కోసం కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తామన్నారు. భాకరాపేటలో కబ్జాకు గురైన స్థలాలను అధికారంలోకి రాగానే స్వాధీనం చేసుకుని పేదలకు అప్పగిస్తామన్నారు.జనసేన నాయకులు దేవర మనోహర శెట్టి, సురేంద్ర, బీజేపీ నేత పురుషోత్తమ నాయుడు, టీడీపీ నేతలు హేమాంబరధర రావు, దశరథ నాయుడు, సోమల సురేశ్, మండల పార్టీ అధ్యక్షులు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, కార్యదర్శి మదన మోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, ఆర్వీ రమణారెడ్డి, మౌలాలి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



చంద్రగిరి, ఏప్రిల్ 4: చంద్రగిరి మండలంలోని భీమవరం, చిన్నరామాపురం, పాతపాటివారిపల్లె, శేషాపురం, కందులవారిపల్లె, ఎ.రంగంపేట గ్రామాల్లో గురువారం సీఐ రామయ్య, ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్‌లు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించునేందుకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు.



టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులతో ఆరణి శ్రీనివాసులు, సుగుణమ్మ

టీడీపీలోకి వైసీపీ నేతలు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 4: నగర పరిధిలోని 14వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు వందమందికిపైగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జేబీ శ్రీనివాసులు, శ్రీహరినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్‌వర్మ ఆధ్వర్యంలో గురువారం టీడీపీలో చేరారు. సుగుణమ్మ నివాసం వద్ద వైసీపీ నాయకులకు ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 14వ డివిజన్‌కు చెందిన యశోద, యశ్వంత్ వారి బృందంతో పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. ఈ చేరికలు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, బీవీ కీర్తి పాల్గొన్నారు.

వైసీపీ చాప చుట్టేయడం ఖాయం

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 4: రానున్న ఎన్నికల్లో వైసీపీ చాప చుట్టేయడం, చంద్రబాబు నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు అరుణ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీల సమావేశం ఓ ప్రైవేటు హోటల్లో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అరుణ్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్ పాలన సాగుతోందన్నారు. ల్యాండ్, శాండ్, లిక్కర్ మాఫియాలు యథేచ్ఛగా దోచుకుంటున్నాయని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాళా తీయించిందన్నారు. అభివృద్ధి అనేది కానరాకుండా పోయిందని అన్నారు. నిధులన్నీ వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులన్నీ స్వప్రయోజనాలకే వాడారని విమర్శించారు. బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైసీపీ దోపిడీ గురించి తెలియజేయాలని కోరారు. అనంతరం జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు అరుణ్‌సింగ్ సమక్షంలో బీజేపీలో చేరారు. అలాగే ఏబీవీపీ జాతీయ నాయకుడు నాగోతు హరికృష్ణ బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం జరిగిన అంతర్గత సమావేశంలో ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ కుట్రలను ఎన్‌డీపీ కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా అడ్డుకోవాలని కోరారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్, పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జ్ సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి, సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, మునిసుబ్రహ్మణ్యం, శాంతారెడ్డి పాల్గొన్నారు.

అరుణ్‌సింగ్‌కు ఘన సన్మానం

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌కు స్థానిక బీజేపీ నాయకులు ఘన సన్మానం చేశారు. గురువారం తిరుపతికి వచ్చిన ఆయనకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుకర్, పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జ్ సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి, సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, మునిసుబ్రహ్మణ్యం, శాంతారెడ్డి, డాక్టర్ శ్రీహరిరావు, అజయ్‌కుమార్, రాటకొండ విశ్వనాథ్, గుండాల గోపీనాథ్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికి, సన్మానించారు.

శెట్టిపల్లి పంచాయతీకి ఏడాదిలోగా తెలుగుగంగ



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నాని

మంగళం, ఏప్రిల్ 4: రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఏడాదిలోగా ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీకి తెలుగు గంగ నీరందిస్తానని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని హామీ ఇచ్చారు. గురువారం మంగళం పంచాయతీలోని మంగళం క్వార్టర్స్ వద్ద పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. మంగళం పంచాయతీ పార్టీ అధ్యక్షుడు సురేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో నానీ మాట్లాడుతూ మంగళంలో ఎమ్మెల్యే అనుచరులు ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ కోట్లు వెనకేసుకుంటూ చెవిరెడ్డికి వాటాలు పంపుతున్నారన్నారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో ఈ ఐదేళ్లలో దోచుకోవడం తప్ప అభివృద్ధి ఎక్కడా కనిపించలేదన్నారు. చెన్నాయగుంటలెక్క దాఖలాల్లో ఉన్న 40 ఎకరాల్లో పట్టాలు ఇచ్చి టిడ్కో ఇళ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే బాలకృష్ణాపురం శ్మశాన వాటికకు ప్రహరీ , బోరు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రణధీరపురం పంచాయతీ 14వ వార్డు సభ్యురాలు నాగమణి, రామకృష్ణ సుందరి, నరేంద్ర, వినోద్, 15 కుటుంబాలకు చెందిన వైసీపీ వారు టీడీపీలో చేరారు. వారికి పులివర్తి నాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు దేవర మనోహర్, కిషోర్, సప్తగిరికాలనీ పంచాయతీ అధ్యక్షుడు భాస్కర రెడ్డి, రణధీరపురం పంచాయతీ అధ్యక్షుడు చంద్ర, తిరుమలనగర్ పంచాయతీ అధ్యక్షుడు గోవిందరాజులు నాయకులు మహేశ్వరి, చలపతి, గోపీనాథ్, శ్రీనివాసయాదవ్, భారతమ్మ, బాలాజీ ప్రసాద్, నాగరాజు, భాస్కరరెడ్డి, రవిచంద్ర, ఈశ్వరయ్య, మాతయ్య, రామకృష్ణ, వెంకటరమణ, మధు తదితరులు పాల్గొన్నారు.

చిట్టేటిగుంట కబ్జా..!

4రోజులుగా చెరువు పూడ్చివేత పనులు ● ప్లాట్లు వేసేందుకు మట్టి తోలుతున్న వైసీపీ నేత



చెరువులో తోలిన మట్టి

ఏర్పేడు, ఏప్రిల్ 4: ఏర్పేడు మండలం పెనుమల్లం పంచాయతీలో ఉన్న చిట్టేటి గుంటను కబ్జా చేస్తున్నారు.టీడీపీ హయాంలో ఏర్పేడు మండలంలో పరిశ్రమలు, విద్యాకేంద్రాలను ఏర్పాటు చేశాక భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలో అక్రమార్కులు ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జాకు పాల్పడుతున్నారు.6.5 ఎకరాల విస్తీర్ణంలో ఇటు పాపానాయుడుపేటకు అటు గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయానికి మధ్యలో చిట్టేటిగుంట ఉంది. సమీప గ్రామాలైన పెనుమల్లం, గుడిమల్లం, రావెళ్లవారికండ్రిగ, పెనగడం, పాపానాయుడు పేట, కొత్తకాలువ, చెన్నంపల్లి తదితర గ్రామాల పశువులు ఈ చిట్టేటిగుంటలో మేతకు వచ్చి నీళ్లు తాగేవి. 15 ఏళ్ల క్రితం పెనుమల్లంలో నీటి సమస్య వచ్చినపుడు చిట్టేటి గుంట ద్వారా నీటిని అప్పటి ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు అందించారు. అలాంటి చెరువును పూడ్చివేసి ప్లాట్లు వేయడానికి స్థానిక వైసీపీ నేత ఒకరు పన్నాగం పన్నారు. నాలుగు రోజులుగా ట్రాక్టర్ల సాయంతో మట్టిని తెచ్చి చెరువును పూడుస్తున్నారు. గ్రామస్తులు ప్రశ్నిస్తున్నా లెక్కచేయడం లేదు. పట్టాలు పొందడానికి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పాకాల, ఏప్రిల్ 4: పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీ పెరుమాళ్ల గుడిపల్లెవద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పెరుమాళ్ల గుడిపల్లెకు చెందిన సురేంద్ర దామలచెరువు నుంచి కల్లూరు వైపు వెళ్తుండగా ఆర్టీసీ బస్సు, లారీ ఢీ కొన్నాయి. ఆ మార్గంలో నడిచి వెళ్తున్న సురేంద్ర రెడ్డికి ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు మహిళలు తప్పించుకున్నారు.

రెండు అసెంబ్లీ, తిరుపతి ఎంపీ స్థానాలు ఇవ్వాలి

● మాదిగ మహా జనసంఘ్



తిరుపతి(ఉపధ్యాయనగర్), ఏప్రిల్ 4: జిల్లాలో రెండు అసెంబ్లీ, తిరుపతి ఎంపీ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని మాదిగ మహా జన సంఘ్ (ఎంఎంజేఎస్) డిమాండ్ చేసింది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల బీజేపీ ఎన్నికల నిర్వహణ సంఘాల సమావేశం గురువారం తిరుపతిలో జరిగింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, మరికొందరు ప్రధాన నాయకులు హాజరయ్యారు. వారిని కలిసి తమ డిమాండ్లను చెప్పేందుకు ఎంఎంజేఎస్ నాయకులు ప్రయత్నించారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని సమావేశ మందిరంలోకి ప్రవేశించారు. మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని నినదించారు. వారిని బయటకు పంపే ప్రయత్నం చేయగా అరుణ్‌సింగ్‌ను కలవాలంటూ అక్కడే బైఠాయించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునిసుబ్రహ్మణ్యం ఎంఎంజేఎస్ నాయకులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. కాగా, పార్టీ అధినాయకత్వం దృష్టిలో పడేందుకు తిరుపతికి చెందిన ఆ పార్టీ మాదిగ సామాజిక వర్గ నాయకులు కావాలనే ఇలా చేశారన్న గుసగుసలు వినిపించాయి. మునిసుబ్రహ్మణ్యం అదే సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో తిరుపతి లోక్‌సభ సీటును ఆశించారు. తిరుపతి నుంచి వెళ్లిన ఆశావహుల జాబితాలో తన పేరును కూడా చేర్పించుకోగలిగారు. అయనకు సీటు దక్కకపోవడంతో ఇలా అరుణ్‌సింగ్‌ను కలిసే ప్రయత్నం చేసినట్లు చర్చ నడుస్తోంది.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ



నవోదయాలో ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 4: నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. 39 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలు సాధించారని వెల్లడించారు. లక్ష్మీశ్రీ, జ్యోత్స్న, ఉదయశ్రీ, లాస్య, గౌతంకుమార్, కేతన్ భాస్కర్, లిఖిత, గంగజయదీప్‌రెడ్డి తదితరులు ప్రవేశాలు పొందిన వారిలో ఉన్నారని చెప్పారు. సంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాల వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థ అత్యుత్తమమైందిగా పేరుగాంచిందని చెప్పారు.

చదువుకున్న కళాశాలకు చేయూత మన బాధ్యత

● ఎస్వీ వైద్య కళాశాలలో పెవిలియన్ ఆర్చి ప్రారంభం



సునందకుమార్‌రెడ్డి సహాయంతో నిర్మించిన పెవిలియన్ ఆర్చి

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 4 : చదువుకున్న పాఠశాలకు, కళాశాలకు చేయూతనందించడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని, తద్వారా భావితరాల భవిష్యత్తుకు బాట వేయాలని నారాయణాద్రి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్వీ వైద్య కళాశాలకు తనవంతుగా రూ.15 లక్షలతో నిర్మించిన నారాయణాద్రి పెవిలియన్ ఆర్చిని గురువారం ఆయన కళాశాలకు వితరణ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. రుయా, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, అడిషనల్ సూపరింటెండెంట్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సత్యనారాయణ మూర్తి, ఫాహీమ్ డాక్టర్లు మదన్, శ్రీధర్ పాల్గొన్నారు.

గోవిందరాజ ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 4: గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. 9వ తేదీన తెలుగు క్రోధి నామ ఉగాది పండగ నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత గోవిందరాజ స్వామి, ఆండాళ్ అమ్మవారు, పార్థసారథి స్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి, పుండరీకవల్లీ అమ్మవారికి పూజాధికాలు నిర్వహించారు. ఆలయ శుద్ధి నిర్వహించిన అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, మోహన్‌రావు, ధనంజయ పాల్గొన్నారు.

ఘనంగా మెట్లోత్సవం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 4: అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో గురువారం వేకువజామున అలిపిరిలో మెట్లోత్సవం నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి వచ్చిన 2వేల మంది భజనమండళ్లకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ప్రముఖ కళాకారులు భజనలతో భగవన్నామము పాడుతూ ఉండగా, వీరు మెట్ల మార్గం ద్వారా తిరుమల చేరుకున్నారు. తొలుత అన్నమయ్య వంశీకులు అలిపిరిలో మెట్ల పూజ నిర్వహించి, సంకీర్తనాగానంతో పూజ ప్రారంభించారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టరు ఆకెళ్ల విభీషణ శర్మ, గోవిందరాజ స్వామి ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, అన్నమాచార్య వంశీకులు తాళ్లపాక హరినారాయణాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

హుండీ ధ్వంసం - నగదు చోరీ

పాకాల, ఏప్రిల్ 4: దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లెలోని రామాలయంలో హుండీని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని నగదు చోరీ చేశారు. పత్తిపాటివారిపల్లె గ్రామంలో తాళాలు వేసిన మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంట్లోని వ్యక్తులు బయట వున్న కారణంగా ఎంత మేర చోరీ జరిగిందో తెలియాల్సివుంది. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పద్మావతి వర్సిటీ విద్యార్థినులకు బహుమతులు



విజేతలను అభినందిస్తున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 4 : లూధియానాలోని పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో గతనెల 28 నుంచి ఈనెల ఒకటో తేదీ వరకు నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పద్మావతి యూనివర్సిటీ విద్యార్థినులు బహుమతులు పొందారు. మెహందీ పోటీల్లో బీ ఫార్మసీ విద్యార్థిని జ్యోత్స్నకు తొలి బహుమతి, ఇంజినీరింగ్ విద్యార్థిని ప్రగతిజైస్వాల్, ఎంసీఏ విద్యార్థిని యమునశ్రీకి చర్చాగోష్ఠిలో మూడవ బహుమతి లభించింది. లా విద్యార్థిని హేమలత రంగోలీ పోటీల్లో పాల్గొన్నారు. వీరిని వీసీ ప్రొఫెసర్ డి.భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని అభినందించారు.

ఎల్‌ఎల్‌ఎం నాలుగో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 4: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన ఎల్‌ఎల్‌ఎం నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

15 నుంచి ఎస్వీయూ ఉద్యోగులకు ఒంటి పూట విధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 4: ఎస్వీ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగులు ఈ నెల 15నుంచి ఒంటి పూట విధులకు హాజరుకానున్నారు. మే 31వ తేదీ వరకూ ఈ విధానం అమలు చేయనున్నట్లు రిజిస్ట్రార్ హుస్సేన్ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

అవినీతి అభినయ్‌రెడ్డి

● టీడీఆర్ బాండ్లలో రూ.2వేల కోట్ల స్కాం



మీడియాతో మాట్లాడుతున్న కీర్తన

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 4: టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఉప మేయర్ భూమన అభినయ్ రెడ్డి రూ.2వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన ఆరోపించారు.గురువారం ఆమె కూటమి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ టీడీఆర్ బాండ్ల విషయమై అభినయ్‌రెడ్డి బహిరంగ చర్చకు రావాలన్నారు. మేయర్ శిరీషను డమ్మీచేసి, సకల శాఖా మంత్రి సజ్జల తరహాలో సర్వం తానై అభినయ్ చక్రం తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు. 17మాస్టర్‌ప్లాన్ రోడ్ల మూలాన 1,121మంది భూమి కోల్పోయారని, వీరిలో 868మందికి మాత్రమే టీడీఆర్ బాండ్లు పొందేందుకు అర్హులుగా గుర్తించారని, అందులోనూ 373మందికి మాత్రమే టీడీఆర్ బాండ్లు ఇచ్చారని అన్నారు. మిగిలిన వారికి ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని ఆగ్రహించారు. తన అవినీతి సామ్రాజ్యానికి రిజిస్ట్రేషన్ శాఖను చక్కగా వాడుకున్నారన్నారు. వైసీపీ నాయకులకు మాత్రమే లబ్ధి చేకూరేలా రోడ్లు వేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం రాగానే టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులకు శిక్ష పడేలా చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో అవినీతి అభినయ్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని కోరారు.

పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వండి

● ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4: పోలింగ్ విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలకు నియోజకవర్గ స్థాయిలో శిక్షణ ఇవ్వాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్(జేసీ) ధ్యానచంద్ర ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులకు నామినేషన్ ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18న ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ప్రతి విషయాన్నీ అవగాహన చేసుకోవాలన్నారు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని ప్రలోభపెట్టే కానుకలను నియంత్రించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలు అదితిసింగ్, కిరణ్‌కుమార్, నిషాంత్‌రెడ్డి, ఎన్నికల విధుల్లో ఉన్న రుద్రరాజు, చెన్నయ్య, గీతారాణి పాల్గొన్నారు.

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు

అంకురార్పణ

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 4: కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి అంకురార్పణ జరిగింది. సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు వేద ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. 7 నుంచి 8.30 మధ్య సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయంగారు, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం : కోదండరామాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 8.25 గంటల మధ్య ధ్వజారోహణం జరగనుంది. ఇందులో భాగంగా ఉదయం 6.30 నుంచి 7.45 వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు, ధ్వజపటం, చక్రతాళ్వారుల తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రికి పెద్దశేష వాహన సేవ ఉంటుంది.



సేనాధిపతి ఉత్సవం

ముగిసిన మహాకుంభాభిషేకం

తిరుపతి అర్బన్, మార్చి 4: తిరుపతి గ్రామదేవత తాళ్లపాక పెద్దగంగమ్మ ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవం గురువారంతో ముగిసింది. చివరి రోజు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలలో వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పెద్ద గంగమ్మ యంత్ర, విగ్రహ, శిఖర కలశ స్థాపన చేశారు. మహాపూర్ణాహుతి, అభిజిత్ లగ్నంలో మహాకుంభాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి దివ్యమంగళ విగ్రహాన్ని సుందరంగా అలంకరించారు. నివేదన, ఇత్యాది పూజలు చేపట్టి భక్తులను దర్శనానికి అనుమతించారు. అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మేయర్ డాక్టర్ శిరీష, గ్రూపు ఆలయాల ఈవో కె.మమత పాల్గొన్నారు.





దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు - ఆలయంలో ప్రతిష్ఠించిన నూతన విగ్రహం

అపరిశుభ్రంగా ప్రసూతి ఆస్పత్రి



నీటితో నిండిన వాష్ బేసిన్



దుర్వాసన వస్తున్న అన్నం ప్లేట్లు, చెత్తాచెదారం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 4 : స్థానిక ప్రసూతి ఆస్పత్రి అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. తద్వారా ఇక్కడికి వచ్చే గర్భిణులకు, సహాయకులకు అవస్థలు తప్పడం లేదు. ఆస్పత్రి ముందు సహాయకులు సేద తీరేందుకు, భోజనాలు చేసేందుకు చిన్నపాటి గది ఉంది. తాగేందుకు, చేతులు కడుక్కునేందుకు ఏర్పాటు చేసిన కొళాయిల కింద వాష్ బేసిన్‌లలో చెత్తాచెదారం చేరి నీరు వెళ్లడం లేదు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉండటంతో అక్కడ నీళ్లు తాగలేక, కనీసం చేతులు కడుక్కోలేక అవస్థలు పడుతున్నారు. ఈ గదికి పక్కనే ఉన్న చెత్త కుండీల్లో పడేసిన అన్నం ప్లేట్లు, ఇతర చెత్త దుర్వాసన వెదజల్లుతోంది. వీటిని శుభ్రం చేసే నాథులు లేరు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

వలంటీరు వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత నరసింహయాదవ్

● నరసింహయాదవ్

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 4: వలంటరీ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదని, టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తుందని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు కాని వారు పెన్షన్ పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్ పేర్కొందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పంపిణీ చేయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పిందని, అయితే వైసీపీ వారు టీడీపీపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. వలంటీర్లపై తమకు ఎంతో గౌరవం ఉందని, చాలామంది నిజాయితీగా పనిచేస్తున్నారని, వీరందరికి వారి వారి అర్హతను బట్టి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తగు న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. అయితే కొందరు వలంటీర్లు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్న విషయాన్ని తప్పు పట్టారు. ఎన్నికల కమిషన్ సూచించిన మేరకు నడవలేని వృద్ధులకు, వికలాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందించాలని సూచించారు. పెన్షన్ల పంపిణీలో చాలా జాప్యం జరిగిందని, దీంతో వృద్ధులు చాలా మంది ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానాన్ని పూర్తిగా నిషేధించిన తర్వాతనే మహిళలను ఓటు అడుగుతానని చెప్పిన సీఎం జగన్ ఇపుడు ఏ మొహం పెట్టుకుని బస్సు యాత్రలో ఓట్లు అడుగుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిపై వైసీపీ కార్యకర్త మునికుమార్ కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, టీడీపీ నేతలు ఊట్ల సురేంద్రనాయుడు, రుద్రకోటి సదాశివం, చేజర్ల మనోహరాచారి, మునిరామయ్య, గంగులయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచండి



తిరుపతి రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డిప్యూటి సీఈ ఉపేంద్రకుమార్

తిరుపతి సెంట్రల్ ఏప్రిల్ 4 : తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని రైల్వే నిర్మాణాల విభాగం డిప్యూటీ సీఈ ఉపేంద్రకుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్టేషన్‌లో జరుగతున్న పనులను ఆయన పరిశీలించారు. ప్లాట్‌ఫారాలపై రైళ్ల రాకపోకల సమయంలో లైన్ బ్లాక్‌లు తీసుకోవాలని సూచించారు.ఆపరేటింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. స్టేషన్ మేనేజరు చిన్నప్ప రెడ్డి, నిర్మాణ విభాగం అధికారులు డి.ప్రభాకర్, డి.మాధవరావు, నాగిరెడ్డి, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 61,087 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,530 మంది తలనీలాలు సమర్పించారు.

రేపు అయోధ్యకాండ అఖండపారాయణం

తిరుమల, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై శనివారం తొమ్మిదవ విడత అయోధ్యకాండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. అయోధ్య కాండలోని 31 నుంచి 34 సర్గ వరకు మొత్తం నాలుగు సర్గల్లో 172 శ్లోకాలు, యోగవాశిష్ఠం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 197 శ్లోకాలను పారాయణం చేస్తారు.

ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళం అందింది. భువనేశ్వర్‌కు చెందిన బల్బద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర విరాళం డీడీని తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, సినీ హీరోయిన్ రుక్సార్ ధిల్లాన్ ఉన్నారు.



రుక్సార్ ధిల్లాన్

బిల్లుల్లేని రూ.24.74 లక్షల సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4 : బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.24.74 లక్షలను తిరుపతిలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది సీజ్ చేశారు. సీఐ జయనాయక్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. చిన్న బజారు వీధిలో బంగారు షాపు నిర్వహిస్తున్న మోహన్ రెడ్డి తీసుకెళుతున్న రూ.24.74 లక్షలు సీజ్ చేశారు. నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు సీఐ చెప్పారు.

వైసీపీ ప్రచార కార్యక్రమంలో ఆర్‌పీ, డీలరు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4 : తొట్టంబేడు మండలం చిన్న సింగమాలలో జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమానికి తిరుపతికి చెందిన డీలర్ నాదముని, ఆర్‌పీ శిరీష వెళ్లడం చర్చనీయాంశమైంది. సీఎం జగన్ పాల్గొన్న ఈ కార్యక్రమం కోసం తిరుపతిలోని రైల్వేకాలనీ, దోబీఘాట్, మధురానగర్, అశోక్‌నగర్ ప్రాంతాల నుంచి వందలాది మందిని వైసీపీ నేతలు తరలించారు.

జగ్జీవన్‌రామ్ జయంతిని జయప్రదం చేయండి

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 4 : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని మెమోరియల్ భవన్ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వెంకటరత్నం తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బైరాగిపట్టెడలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో శుక్రవారం జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నామని, అందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, మాసారపు గోపి, గంగులయ్య, లోకేష్, కారుమంచి మధు పాల్గొన్నారు.

వైసీపీకి పాకాల జడ్పీటీసీ రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న పాకాల జడ్పీటీసీ పద్మజారెడ్డి, నంగా బాబురెడ్డి

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 4: వైసీపీలో కనీస మర్యాద లేనందునే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఆమె భర్త వైసీపీ సేవాదళ్ రాష్ట్ర నాయకుడు బాబురెడ్డి ప్రకటించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ పాకాల మండలంలో తమకు కనీస ప్రొటోకాల్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెవిరెడ్డితో ఇమడలేకనే రాజీనామా చేస్తున్నామన్నారు. చెవిరెడ్డి ఎదుగుదల కోసం మొదటి నుంచి ఎంతో కష్టపడ్డామని, ఆయన తమ కష్టాన్ని గుర్తించలేదని తెలిపారు. చెవిరెడ్డి కోసం మాజీ మంత్రి గల్లా అరుణకుమారి వంటి వారితోనూ విభేదించామని, శిలాఫలకంలో వార్డు మెంబర్‌కు ఉన్న ప్రొటోకాల్ కూడా తమకు లేదని చెప్పుకొచ్చారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, పీఏలు రాజ్యమేలుతున్నారని, చిన్న పని కావాలన్నా పీఏ ఫోన్ చేయాల్సిందేనని అన్నారు. నమ్ముకున్న వారికి, పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు లేవన్నారు. త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

తిరుమల బలిజసేన అధ్యక్షుడిగా హరిప్రసాద్

తిరుపతి(ఆటోనగర్) ఏప్రిల్ 4: తిరుమల బలిజ సేన అధ్యక్షుడిగా కె.హరిప్రసాద్‌ను నియమించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. సంఘం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని హరిప్రసాద్ వెల్లడించారు.

జగన్‌రెడ్డి పాలనలో ప్రజలకన్నీ కష్టాలే..!

బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 4 : సీఎం జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు అష్టకష్టాలు పడ్డారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తాడిపర్తి ఆదినారాయణ, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీరెడ్డి మండిపడ్డారు. నాయుడుపేటలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో కూటమి సమావేశంలో వారు మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో ఏడుసార్లు కరెంట్ చార్జీలు పెంచారని, పేదల కడుపునింపే అన్న క్యాంటీన్లను మూసివేశారన్నారు. గంజాయి, డ్రగ్స్‌లో రాష్ట్రాన్ని ప్రథమస్థానంలోకి నిలిపారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవధానం సుధీర్, రంగినేని కృష్ణయ్య, జంపాల మాల్యాద్రినాయుడు, విజయభాస్కర్, తన్నీరు శేషగిరి రావు, గిరిబాబు, పేరం రమేష్‌నాయుడు, నెలవల రాజేష్, జనసేన గిండి సతీష్, యశ్వంత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పెంచాలి

కోట, ఏప్రిల్ 4: ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యత పెంచాలని జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్లు రమణ, ఖలీల్ కోరారు. తిమ్మానాయుడుపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లో జరిగిన పనులను గురువారం ఆయా అధికారులతోపాటు డ్వామా ఏపీడీ డాక్టర్ వరప్రసాద్ తనిఖీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, శాంతి, చంద్రశేఖర్, పరుశురాంతదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

కోట, ఏప్రిల్ 4: కొత్తపాళెంలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. పలు రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలిచ్చారు. అనంతరం కొత్తపాళెంలోని నాడు-నేడు నిధులతో జరుగుతున్న ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. హెచ్‌ఎం పద్మావతి తదితరులున్నారు.

స్వర్గధామం గ్యాలరీ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం



చెక్కును అందజేస్తున్న దాతలు

కోట, ఏప్రిల్ 4 : కోట పట్టణ పొలిమేరల్లో ఏర్పాటు చేసి ఉన్న హిందూ శ్మశానవాటిక స్వర్గ ధామంలో గ్యాలరీ ఏర్పాటుకు పసుపులేటి చారిటబుల్ ట్రస్టు గురువారం రూ.2 లక్షలను విరాళమిచ్చింది. ట్రస్టు చైర్మన్ సంపూర్ణమ్మ తన భర్త మనోహర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును స్వర్గధామం ప్రతినిధి జెన్ని ప్రసాద్‌కు తన మనవడు నిహార్ మనోహర్ ద్వారా అందజేశారు. ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ దంపతులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



సుజీవనమ్మ

డక్కిలి, ఏప్రిల్ 4:ఎస్వీ యూనివర్సిటీలోని హోంసైన్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి డక్కిలి మండలం అల్తూరుపాడుకు చెందిన కె.సుజీవనమ్మకు డాక్టరేట్ ప్రదానం చేశారు. గృహవిజ్ఞానశాస్త్ర సీనియర్ ఆచార్యులు కె.అనురాధ పర్యవేక్షణలో క్వాలిటీ ఆఫ్ ఈసీఈ ప్రోగ్రామ్స్ ఇన్ డిఫరెంట్ సెక్టార్స్ ఇన్ రిలేషన్ టూ ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్స్ కాంపిటెన్సీస్ ఇన్ బెంగళూరు, మైసూర్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు పరీక్షల నియంత్రణ అధికారి దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీలోకి మాజీ సర్పంచ్ చేరిక

వాకాడు, ఏప్రిల్ 4 : వల్లమేడు మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు వాకాటి సంపత్‌కుమార్ గురువారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఆధ్వర్యంలో గూడూరులో జరిగిన ఆత్మీయ సమావేశంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు, గూడూరు కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

గూడూరు/చిల్లకూరు, ఏప్రిల్ 4: రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. గూడూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోటుపాళెం గ్రామానికి చెందిన ఏడుకొండలు(30).. వెల్డింగ్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం పని నిమిత్తం గ్రామం నుంచి నడుచుకుంటూ గూడూరుకు వస్తున్నాడు. జాతీయ రహదారిపై కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి అయన్ను ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ●చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెంకు చెందిన మురళి(45) గ్రామం నుంచి బైక్‌పై గూడూరు వైపు గురువారం రాత్రి బయల్దేరాడు. గ్రామ సమీపంలోనే ఎదురుగా వస్తున్న మరోబైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మోటర్ సైకిళ్లను ఢీకొట్టిన కారు

బాలాయపల్లి, ఏప్రిల్ 4: మోటర్ సైకిళ్లను ఓ కారు ఢీకొట్టింది. ఈ సంఘటన మండలంలోని జయంపు గ్రామంలో గురువారం జరిగింది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం పార్కింగ్ చేసి ఉన్న మోటర్ సైకిళ్లను ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. స్థానికులు గమనించి కారును ఆపగా, అందులోని వారు మద్యం మత్తులో ఉన్నారు. వీరిని వాహనంతోపాటు పోలీసులకు స్థానికులు అప్పగించారు. ఈ సంఘటనలో ఎవరూ గాయపడలేదు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, ఏప్రిల్ 4: కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డు వద్ద గురువారం 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. కోట దళితవాడకు చెందిన దాసరి సుకుమార్, ఇంగిలాల కోటయ్యలు మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా.. కాపు కాచి పట్టుకుని, వారిద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి ఓ ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీవోకు గ్రామస్తులు, టీడీపీ నేతల ఫిర్యాదు



బస్సులో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు

కోట, ఏప్రిల్ 4: నెల్లూరుపల్లి కొత్తపాళెం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఎంపీడీవో శంకరయ్యకు గురువారం గ్రామస్తులు, టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా నాయుడుపేటలో జరిగే సిద్ధం సభకు వైసీపీ తరఫున రాంబాబు జన సమీకరణ చేశారని, పైగా తానుకూడా వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి బస్సులో సభకు వెళ్లారని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు కూడా ఉన్నాయని, ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

23మంది వలంటీర్ల రాజీనామా

కోట, ఏప్రిల్ 4 : కోట పట్టణంలోని సచివాలయం 1, 2, 3ల నుంచి గురువారం 23మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు. తొలుత 24 మంది రాజీనామా చేశారు. వీరిలో శ్యామసుందరపురానికి చెందిన ఓ మహిళా వలంటీర్ మాత్రం తన తప్పు తెలుసుకున్నానని, రాజీనామా ఆమోదించవద్దని ప్రాధేయపడ్డారు. దీంతో ఆమె రాజీనామా పత్రాన్ని వెనక్కిచ్చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

తూర్పు కనుపూరు.. జనసంద్రం

ముత్యాలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు









పుష్పాలంకరణలో ముత్యాలమ్మ

ఆలయం వద్ద భక్తులు - గ్రామోత్సవంలో నాట్యం చేస్తున్న గణాచారి - పోలేరమ్మకు హారతి

చిల్లకూరు, ఏప్రిల్ 4: ముత్యాలమ్మ జాతరకు మూడో రోజైన గురువారం భక్తులు పోటెత్తారు. తూర్పుకనుపూరు, కోట, సిద్ధవరం, మార్గాల్లో సుమారు కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. ఒక దశలో తూర్పుకనుపూరు జనసంద్రంలా కనిపించింది. భక్తులు వేయికండ్ల కుండలను నెత్తిన పెట్టుకుని గుడిపైకి కోడి పిల్లలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ముత్యాలమ్మతోపాటు గంగమిట్ట మీద ఉంచిన పోలేరమ్మకు కూడా పొంగళ్లు సమర్పించారు. గురునాథస్వామి, అంకమ్మలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు నృత్యాలు చేశారు. అనంతరం గంగమిట్ట సమీపంలో రెండు తాటిచెట్ల మధ్య వేసిన ఉయ్యాలలో పోలిశెట్టి, గణాచారులు అమ్మణ్ణికి ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బందోబస్తు నిర్వహించారు. ఇక భక్తులు ఎండ వేడిమికి తట్టుకోలేక తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నివాసాల్లో, చెట్ల కింద సేద తీరారు. పలు కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు, అంబళ్లు సరఫరా చేశారు. అంతేకాకుండా ఆలయ సిబ్బంది జాతరకు వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



వేయికండ్ల కుండలతో భక్తులు

అమ్మవారికి పూలంగిసేవ

ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం పూలంగిసేవ నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు.

నేటితో ముగియనున్న జాతర

గంగమిట్ట మీద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పోలేరమ్మ అమ్మవారిని నాల్గవ రోజు శుక్రవారం ఉదయం ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లనంపుతారు. ఈ కార్యక్రమంతో జాతర ముగుస్తుంది.

'సిద్ధం' సభలకు ఆర్టీసీ బస్సులు

తీవ్ర ఇబ్బందిపడ్డ ముత్యాలమ్మ భక్తులు, ప్రయాణికులు





జాతరకు వెళ్లేందుకు గూడూరులో బస్సు వద్ద రద్దీ - నాయుడుపేట ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గూడూరు, ఏప్రిల్ 4: పూతలపట్టు, నాయుడుపేట ప్రాంతాల్లో నిర్వహించిన ' మేమంతా సిద్ధం' సభలకు గూడూరు డిపో నుంచి 10 బస్సులను తరలించారు. దీంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ జాతరకు వెళ్లేందుకు బస్సుల కొరత ఏర్పడి.. భక్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. జాతరకు ప్రతి ఏడాది గూడూరు పాత బస్టాండు నుంచి ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతుంది. గత ఏడాది జాతరకు రెండ్రోజులపాటు గూడూరు డిపోకు చెందినవి 20, ఇతర డిపోలకు చెందినవి 20 కలిపి మొత్తం 40 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. వీటివల్ల సుమారు రూ.10 లక్షల వరకు కలెక్షన్ వచ్చినట్లు అంచనా. ఈ ఏడాది బుధవారం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయలేదు. గూడూరు డిపోలో మొత్తం 45 బస్సులుండగా బుధవారం 10 వాహనాలను సిద్ధం సభకు తరలించారు. గురువారం కూడా 10 బస్సులను పంపారు.ఈ క్రమంలో గురువారం మాత్రం 10 బస్సులను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇవి చాలక పోవడంతో భక్తులు తీవ్ర అవస్థ పడ్డారు. ఇంకొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తే వారు అధిక చార్జీలు వసూలు చేశారని జనం ఆవేదన వ్యక్తం చేశారు. జాతర సమయంలో కూడా సిద్ధం సభలకు బస్సులను పంపడంపై భక్తుల నుంచి విమర్శలొచ్చాయి.

బస్టాండుల్లో ప్రయాణికుల నిరీక్షణ

నాయుడుపేట: సిద్ధం సభలకు ఆర్టీసీ బస్సులు తరలించడంతో సూళ్లూరుపేట, నాయుడుపేట బస్టాండుల్లో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మరోవైపు తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ జాతరకు కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయలేదు. జాతరకు వెళ్లేవారూ అవస్థ పడ్డారు. ఆటోలను ఆశ్రయిస్తే, వారు అధిక చార్జీలు వసూలు చేశారని ప్రయాణికులు వాపోయారు.

వెంకటగిరిలో ఇలా..

వెంకటగిరి టౌన్: సిద్ధం సభకు వెంకటగిరి డిపో నుంచి ఎనిమిది బస్సులు తరలించారు. దీంతో ఇక్కడా ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి: పాశిం



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 4: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న రాక్షసపాలనకు రానున్న ఎన్నికలలో చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పగడాలపల్లి గ్రామంలో పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీకండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం దోచుకోవడమే ధ్యేయంగా పాలన సాగించిందని మండిపడ్డారు. అవినీతిని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి, దౌర్జన్యాలకు దిగారన్నారు. రామరాజ్యం రావాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. నంభూరు వెంకటేశ్వర్లునాయుడు, పుట్టి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, పెంచలరెడ్డి, శ్రీహరినాయుడు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదు

గూడూరు అర్బన్: వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదని పాశిం సునీల్‌కుమార్ అన్నారు. రాజకీయాలు చేసే వలంటీర్లకు మాత్రమే టీడీపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. వలంటీర్లను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ఇక ప్రతిపక్షాలను దూషించేందుకే పింఛన్ల పంపిణీకి అడ్డంకులను వైసీపీ సృష్టిస్తోందని, కోడికత్తి డ్రామాలను ఇక ప్రజలు నమ్మరని పేర్కొన్నారు.

పింఛన్ల పాపం జగన్‌దే : నెలవల విజయశ్రీ



వృద్ధురాలితో మాట్లాడుతున్న పరసా, అభివాదం చేస్తున్న విజయశ్రీ

తడ, ఏప్రిల్ 4: 'పింఛన్ల సొమ్మును సకాలంలో బ్యాంకులకు జమ చేయకుండా వృద్ధులను వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసింది. ఈ పాపం జగన్‌దే' అని టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ విమర్శించారు. గురువారం సాయంత్రం తడలో టీడీపీ ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. 32 మంది వృద్ధుల ప్రాణాలు కోల్పోవడానికి జగనే కారణమన్నారు. మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ.. పేద ప్రజల ఉసురు ఈ ప్రభుత్వానికి తగులుతుందని చెప్పారు. పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయకులు బొమ్మన పళణి, నీలకంఠం, శివ, శివాజీ, జయపాల్, శ్యామ్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాగానే 4వేల పింఛను ఇంటికే

దొరవారిసత్రం: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛను డబ్బులు ఇంటి వద్దకే వస్తాయని మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం అన్నారు. దొరవారిసత్రం మండలం వేణుంబాకలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, 786 రఫీ, టీడీపీ నేతలతో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి పల్లంపర్తి మనోహర్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు గోను జక్కరయ్య, మొండెం బాబు, ప్రసాద్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఉదయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తప్పులను చంద్రబాబుపై నెట్టడం దారుణం

● వెంకటగిరి టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ



వృద్ధుడితో మాట్లాడుతున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 4: వైసీపీ ప్రభుత్వం చేసే తప్పులను టీడీపీ అధినేత చంద్రబాబుపై నెట్టడం దారుణమని వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని 21వ వార్డు, రూరల్ పరిధిలోని మన్నూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ నాయకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎన్నికల్లో వైసీపీకి ఎలా బుద్ధి చెప్పాల్లో ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేశారని తెలిపారు. టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథనాయుడు, శివ, శ్రీరామదాస్ గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, గల్లా శ్రీనివాసులు, సుధ ఉన్నారు.

రాజకీయాన్ని వ్యాపారం చేసిన జగన్

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాజకీయాన్ని వ్యాపారం చేసేశారని టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయి ప్రియ విమర్శించారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. 'జగన్ సీఎం అయ్యాక లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నాడని జనం అనుకుంటుంటే విన్నాను. అంత డబ్బు ఏం చేసుకుంటావు జగన్' అని ప్రశ్నించారు. గంగోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

బ్యాటరీ బైక్ దగ్ధం



వడమాలపేట, ఏప్రిల్ 4: బ్యాటరీ బైక్ ఒకటి దగ్ధమైన సంఘటన వడమాలపేట సమీపంలో అంజేరమ్మ కనుమ వద్ద జరిగింది. మండలంలోని పాపరాజుకండ్రిగకు చెందిన శివకుమార్ తన తండ్రి సుబ్బరామయ్యతో కలిసి గురువారం ఉదయం ఏపీ39 ఎంఎన్3619 నెంబరు గల బ్యాటరీ బైక్‌పై సొంత గ్రామానికి వస్తున్నారు. అంజేరమ్మ కనుమ వద్దకొచ్చేసరికి ఉన్నట్టుండి శబ్దం వచ్చింది. వాహనాన్ని ఆపి చూస్తే వెనుక భాగంలో మంటలు కనిపించాయి. దాంతో వాహనాన్ని వదిలి దూరంగా వచ్చేశారు. కొంతసేపటికి మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 61,087 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,530 మంది తలనీలాలు సమర్పించారు.

ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళం అందింది. భువనేశ్వర్‌కు చెందిన బల్భద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర విరాళం డీడీని తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

రేపు అయోధ్యకాండ అఖండపారాయణం

లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై శనివారం తొమ్మిదవ విడత అయోధ్యకాండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకం కాదు : గాలి భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 4: వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాలతో సంబంధం లేకుండా పనిచేస్తున్న వలంటీర్ల పట్ల గౌరవభావంతోనే ఉంటామని, అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని తేల్చి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే.. టీడీపీపైకి వలంటీర్లను రెచ్చగొట్టి వైసీపీ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందని, ఆ ఉచ్చులో చిక్కుకోవద్దని హితవు పలికారు. పింఛన్ల విషయంలో జగన్.. నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. గత ఎన్నికల ముందు బాబాయ్ హత్య, కోడి కత్తి కేసుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన జగన్.. ఈసారి వృద్ధుల మరణాలతో రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు.

బీసీలకు అండగా ఉండేది టీడీపీనే



సమావేశంలో ప్రసంగిస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 4: బీసీలకు నిరంతరం అండగా ఉండే పార్టీ టీడీపీ ఒక్కటేనని క్లస్టర్ ఇన్‌చార్జి, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని మంచినీళ్లబావి వీధిలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలపై జరిగినన్ని దాడులు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏ ప్రభుత్వ హయాంలోనూ లేవన్నారు. కులానికో కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు, విధుల్లేని పదవులిచ్చి బీసీ నాయకులను ఉత్సవ విగ్రహాలుగా సీఎం జగన్ మార్చేశారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా ఏకమై ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, రూరల్ పార్టీ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెరుకుల కరుణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ రాజన్‌కు సన్మానం

పుత్తూరు అర్బన్/వడమాలపేట, ఏప్రిల్ 4: టీడీపీ చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడిగా నియమితులైన సీఆర్ రాజన్‌ను నగరి నియోజకవర్గ టీడీపీ నాయకులు గురువారం సన్మానించారు. చిత్తూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ధనంజయ నాయుడు, పుత్తూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, వడమాలపేట నేతలు మునిశేఖర్, బాలకృష్ణ, పుత్తూరు పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు హరి, పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నవీన్, లక్ష్మీపతి, మహేష్ పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలన నుంచి విముక్తే లక్ష్యం: ఆదిమూలం



టీడీపీలో చేరిన వారితో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 4: వైసీపీ అరాచకపాలన, దౌర్జన్యాల నుంచి విముక్తే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం అన్నారు. గురువారం హరి ఫంక్షన్ హాలులో మండల పరిధిలోని వెంకటకృష్ణపాలెం, నాగిలేరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందరావు, పెద్దబ్బ, వెంకటేశన్, భాస్కర్, బాలరాజు, చంద్రతోపాటు సుమారు 60 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఆదిమూలం వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే చంద్రన్న సీఎం అవడం ఖాయమని తెలిపారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని చంద్రబాబు చెప్పారని గుర్తుచేశారు. పింఛన్లపై వైసీపీ రాజకీయం చేయడం దారుణమని వాపోయారు. టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, మల్లికార్జున రెడ్డి, ఇలాంగోవన్ రెడ్డి, పద్దురాజు, హరి, కేఎస్ రవి, పరుశురామయ్య, వాసుదేవయ్య, దొరవేలు, బాల, సొరకాయలు తదితరులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిట్టేటిగుంట కబ్జా..!

● ప్లాట్లు వేసేందుకు మట్టి తోలుతున్న వైసీపీ నేత



చెరువులో తోలిన మట్టి

ఏర్పేడు, ఏప్రిల్ 4: టీడీపీ హయాం లో ఏర్పేడు మం డలంలో పరిశ్రమ లు, విద్యాకేంద్రా లను ఏర్పాటు చేశా రు. దీంతో మండ లంలో భూముల ధర లకు రెక్కలొ చ్చాయి. ఈ క్రమంలో అక్రమార్కులు ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జాకు పాల్పడుతున్నారు. ఏర్పేడు మండలం పెనుమల్లం పంచాయతీలో ఉన్న చిట్టేటి గుంట ఉంది. మొత్తం 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఇటు పాపా నాయుడుపేటకు అటు గుడిమల్లం పరశురామేశ్వర స్వామి అలయా నికి మధ్యలో చిట్టేటిగుంట ఉంది. సమీప గ్రామాలైన పెనుమల్లం, గుడి మల్లం, రావెళ్లవారికండ్రిగ, పెనగడం, పాపానాయుడుపేట, కొత్తకాలువ, చెన్నంపల్లి తదితర గ్రామాల రైతుల పశువులు ఈ చిట్టేటిగుంటలో మేతకు వచ్చి నీళ్లు తాగేవి. 15 ఏళ్ల క్రితం పెనుమల్లంలో నీటి సమస్య వచ్చినపుడు చిట్టేటి గుంట ద్వారా నీటిని అప్పటి ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు అందిం చారు. అలాంటి చెరువును పూడ్చివేసి ప్లాట్లు వేయడానికి స్థానిక వైసీపీ నేత ఒకరు పన్నాగం పన్నారు. నాలుగు రోజులుగా ట్రాక్టర్ల సాయంతో మట్టిని తెచ్చి చెరువును పూడుస్తున్నారు. గ్రామస్తులు ప్రశ్నిస్తున్నా లెక్కచేయడం లేదు. పట్టాలు పొందడానికి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమా చారం. కలెక్టర్ స్పందించి చిట్టేటిగుంటను కబ్జానుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

జగన్ రాకతో.. ప్రయాణికుల ఇక్కట్లు



ఏర్పేడు, ఏప్రిల్ 4: సీఎం జగన్ పర్యటన సందర్భంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దులుపడ్డారు. రేణిగుంట మండలంలో గురువారం సీఎం ర్యాలీ సాగింది. ఈ ర్యాలీ శ్రీకాళహస్తి మీదుగా నాయుడు పేటకు వెళ్లింది. ఈ నేప థ్యంలో తిరుపతి వైపు వెళ్లే బస్సులను విమానాశ్రయ మార్గంలో మళ్లించడంతో ఏర్పేడు మార్గంలో ప్రయాణికులు గంటల తరబడి మండుటెండలో బస్సుల కసం నిరీక్షించాల్సి వచ్చింది.

ఏర్పేడులో ఆగని జగన్ బస్సు

ఏర్పేడు, ఏప్రిల్ 4: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన బస్సుయాత్ర ఏర్పేడుకు గురువారం ఉదయం 11.40గంటలకు చేరుకుంది. చాలామంది వైసీపీ అభిమానులు వేచి ఉన్నప్పటికీ జగన్ బస్సు ఆగకుండా వెళ్లిపోవడంతో వారంతా అసంతృప్తిగా వెనుదిరిగారు. అంతకు ముందు సీతారాంపేట వద్ద వేరుశెనగకాయ చెట్లతో స్వాగతం పలకడానికి వచ్చిన రైతు కూలీలతో జగన్ మాట్లాడారు. అలాగే ఎఫ్‌సీఐ గోదాము వద్ద కల్లుగీత కార్మికులతో మాట్లాడారు.

సీఎం సభకే బస్సులన్నీ..!



కేవీబీపురం, ఏప్రిల్ 4: మండలంలో ఉన్న 19 సచివాల యాల పరిధిలోని గ్రామాల ప్రజలను నాయుడుపేటలో జరిగే ముఖ్యమంత్రి 'మేమంతా సిద్ధం' సభకు తరలించడానికి సుమారు 20 బస్సులు గురువారం ఉదయం చేరాయి. చిత్తూరు డిపోకు చెందిన బస్సులు జనాలను తరలించాయి.

ఏడుగురు వలంటీర్ల రాజీనామా

ఏర్పేడు, ఏప్రిల్ 4: ఏర్పేడు మండలం రావిళ్లవారి కండ్రిగకు చెందిన ఏడుగురు వలంటీర్లు గురువారం సాయంత్రం రాజీనామా చేశారు. రాజీ నామా లేఖను ఎంపీడీవో కార్యాలయానికి పంపినట్లు వలంటీర్లు తెలిపారు. కాగా వైసీపీకి ప్రచారం చేయాలని ఆలోచనతోనే వలంటీర్లు రాజీనా చేశారని తెలుస్తోంది.

ఆదిమూలాన్ని గెలిపించుకుందాం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌నాయుడు

పిచ్చాటూరు, ఏప్రిల్ 4: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటిం చారని నాయకులు అధిష్ఠానం ఆదేశాలు పాటించి ఆయన్ను గెలిపించుకుందామని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు తెలియజేశారు. గురువారం పిచ్చాటూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిమూలం సమక్షంలో ఏడు మండలాలకు చెందిన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. శనివారం పిచ్చాటూరులో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. అనంతరం ప్రతి పంచాయతీ నుంచి ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసుకుని ప్రచారాన్ని ఆదిమూలం ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి తన పెత్తనం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి టీడీపీ శ్రేణుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని తెలియజేశారు. పెద్దిరెడ్డి ట్రాప్‌లో టీడీపీ నాయకులు పడవద్దని హితవు పలికారు. వచ్చేది టీడీపీయేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు పాలగిరి మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు భాస్కరన్, పద్మరాజు, జయచంద్రనాయుడు, రవి, వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోరు జాగాలో ఇంటి నిర్మాణం డీఎల్‌పీవో విచారణ



టీడీపీ నాయకులతో వాగ్వాదానికి దిగిన వైసీపీ నాయకుడు వెంకటరమణ

రేణిగుంట, ఏప్రిల్ 4: రేణి గుంట పంచాయతీ ఆధీ నంలో ఉన్న సుబ్బ రాజు బోరు జాగాలో అక్రమ నిర్మాణంపై డీఎల్‌పీవో ప్రభురెడ్డి గురు వారం పంచాయతీ విచారణ చేపట్టారు. ఫిర్యాదు దారుడు రావణన్, పంచా యతీ ఈవో రవిశంకర్‌రెడ్డిని ఇల్లు నిర్మించిన యజమాని వద్ద విచారణ జరిపారు. రికార్డులను పరిశీలించారు. సాయంత్రం సుబ్బరాజు బోరు వద్ద నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించారు. స్థానికుల వద్ద విచారణ చేశారు. దాదాపు 50 ఏళ్లుగా అక్కడ పంచాయతీ బోరు షెడ్డు ఉండేదని ఆ బోరు ద్వారా నీరు సరఫరా అయ్యేదని స్థానికులు వివరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటా మన్నారు. కాగా బోరు వద్ద స్థానికులను విచారించేందుకు డీఎల్‌పీవో వెళ్లిన సమయంలో టీడీపీ నాయకులు సైతం వెళ్లారు. దీంతో ఇంటిని నిర్మిస్తున్న వైసీపీ నాయకుడు వెంకటరమణ వారితో వాగ్వాదానికి దిగాడు.

పింఛను కోసం వెళుతూ వృద్ధుడి మృతి



మృతి చెందిన వెంకటరాజు

ఏర్పేడు, ఏప్రిల్ 4: పింఛను కోసం వెళుతూ ఓ వృద్ధుడు చనిపోయాడు. కందాడ సచివాల యం పరిధిలోని సదాశివపురం గ్రామానికి చెందిన కురసకోల వెంకటరాజు (75) పింఛను కోసం కందాడకు వెళుతుండగా ఎండవేడికి తాళలేక మార్గమధ్యంలో సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు చూసే సమయానికి మృతిచెందాడు. మృతునికి భార్య, పిల్లలు, ఎవరూ లేరు. మేనల్లుడైన రవిరాజు వద్ద జీవనం సాగించేవాడు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణా మూర్తిస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం పురస్కరించుకొని ఆలయ అర్చకులు ముందుగా గురుదక్షిణా మూర్తి సన్నిధిని శుద్ధిచేశారు. శాస్త్రోక్తంగా కలశస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరిం చారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణ కవచాలంకృతంగా అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడిసెనగల దండలను భక్తులు సమర్పించారు. వేదమంత్రాల నడుమ ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సత్తెమ్మకు ప్రత్యేక పూజలు

కేవీబీపురం, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో వెలసిన గ్రామదేవత సత్తెమ్మ తల్లికి గ్రామస్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా చిత్రపౌర్ణమి సందర్భంగా ముత్తుమారి యమ్మ గుడిలో ఈ నెల 26వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో అమ్మ వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

దళితుల ఆత్మగౌరవం టీడీపీతోనే



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎస్సీసెల్ నాయకులు

తొట్టంబేడు, ఏప్రిల్ 4: దళితులు ఆత్మగౌరవంతో బతకాలంటే టీడీపీని గెలిపించుకోవాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు చుక్కల రమేష్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం లోని గంగులపూడి, మద్దిలేడు, రాచగున్నేరి గ్రామాల్లోని ఎస్సీ కాలనీలలో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే టీడీపీకి ఓటు వేయాలన్నారు. రానున్న ఎన్నిల్లో బొజ్జల సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాధాకృష్ణయ్య, నాయకులు గురుస్వామి, కూలి గోవర్ధన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఆధ్యాత్మిక గురువు స్వామి మిత్రానంద



స్వామీజీకి శ్రీసిటీ గురించి వివరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, ఏప్రిల్ 4: స్వామి చిన్మయానంద ప్రముఖ శిష్యులు, చెన్నై చిన్మయ మిషన్ ఆధ్యాత్మిక గురువు స్వామి మిత్రానంద గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్య క్రమాలు, ఈ ప్రాంత అభివృద్ధిపై వాటి సానుకూల ప్రభావం గురించి వివరించారు. అనంతరం స్థానిక పరిశ్రమల సీఈవోల సమావేశంలో స్వామి మిత్రానంద ప్రసంగించారు. తర్వాత స్థానిక చిన్మయ విద్యాల యంలో అదనపు భవన నిర్మాణ భూమిపూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్మయ మిషన్ ట్రస్టీ ఓ.వీ.నంబియార్, విద్యా సంచాలకులు సత్యమూర్తి, కరస్పాండెంట్లు ఉమా కల్యాణం, గీతామీనన్ పాల్గొన్నారు.

వైసీపీతో రాష్ట్రానికి చేటు: సుధీర్



4వార్డులోని ల్యాండ్రీ షాపు వద్ద ప్రచారం చేస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: వైసీపీతో రాష్ట్రానికి తీరని చేటు జరిగిందని శ్రీకాళహస్తి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 4,5, 6 వార్డుల్లో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్, నాయకులు కంఠా రమేష్ పాల్గొన్నారు.

అంతా భ్రాంతియేనా..!

● డ్రైవర్ల సమావేశంలో హైడ్రామా
● మాట్లాడే వారిని ముందుగానే ఎంపిక
● నాటకీయంగా శిక్షణ ఇచ్చిన ఐప్యాక్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: సీఎం జగన్ నిర్వహిం చిన ఆటో డ్రైవర్ల సమావేశంలో భాగంగా జనా నికి భ్రాంతి కల్పించేందుకు బాహాటంగా హై డ్రామా చేశారు. పెద్దఎత్తున డ్రైవర్లు సమావేశా నికి వచ్చి జగన్‌కు భావోద్వేగంతో ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపేలా నాటకీయ ప్రదర్శనకు పథకం వేశారు. అయితే ఇందుకోసం డ్రైవర్లను సమీకరించడంలో విఫలమయ్యారు. వేదిక వద్ద 5 లారీలు, 6 టిప్పర్లు, 2 మినీలారీలు, 8 ఆటోలు మాత్రమే దర్శనమిచ్చాయి. ఇక 17 ఆటోలు వేదిక పక్కన రహదారిపై పెట్టారు. ఇందులో కొస మెరుపు ఏంటంటే... శ్రీకాళహస్తి నుంచి కనీసం 50 మంది డ్రైవర్లు కూడా హాజరు కాలేదని సమాచారం. తిరుపతి, తిరుచానూరు, రేణిగుంట, నాయుడుపేట ప్రాంతాల నుంచి డ్రైవర్లను వేదిక వద్దకు తరలించారు. వారిలో ముందుగానే 9 మందిని ఎంపిక చేసుకున్నారు. వేదిక వద్ద ఉదయం నుంచి ఓ యువతి హైడ్రా మాకు నాయకత్వం వహించింది. ఆమె తన బృందంతో కలిసి సీఎం జగన్ సమావేశంలో మాట్లాడే డ్రైవర్లకు కాగితాల్లో ముందుగానే స్క్రిప్ట్ ఇచ్చారు. ఆ ప్రకారం వాళ్లు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపేలా ప్లాన్‌చేశారు. ఇందులో త్రిశూల వ్యూహం అవలంబించారు. మాట్లాడే వారందరినీ జనంలో ఎక్కడ ఉన్నా గుర్తుపట్టేలా.. వారి జేబులకు పేర్లు రాసి వైసీపీ టోకెన్ నంబర్లతో కార్డును అతికించి పెట్టారు. అంతేగాకుండా అందరూ ఒకే చోట కూర్చో కుండా... వారికి అక్కడక్కడా సీట్లు కేటాయిం చారు. వైసీపీ పెయిడ్ బృందం హైడ్రామా అమలు చేశారు.

ఆకలి కేకలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: సీఎం జగన్ డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో పేదలు ఆకలితో అలమటించారు. తొట్టంబేడు మండలం పొయ్యి వద్ద ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 12:30 సమయంలో సమావేశం జరిగేలా షెడ్యూలు సిద్ధం చేశారు. గంట ముందు నుంచే జనం చేరుకున్నారు. కానీ 2:15 నిమిషాలకు ఆలస్యంగా సమావేశం మొదలైంది. 3 గంటలకు సమావేశం ముగిసింది. ముందుగా వేదిక వద్ద ఎవరికీ భోజనాలు పంపిణీ చేయలేదు. మధ్యలో భోజనాలు వచ్చినా అరకొరగా ఉన్న జనం చెదిరిపోతారని ఎవరికీ అందించలేదు. సీఎం వెళ్లాక భోజనం పెట్టారు. అప్పటికే ఆకలితో చాలామంది వెళ్లిపోయారు. వేదిక పరిసరాల్లో ఎక్కడా దుకాణాలు కూడా లేకపోవడంతో మండు టెండలో చాలామందికి ఆకలి కేకలు తప్పలేదు.

రండి నాయినా... !

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: నాయినా సమావేశానికి రండి నాయినా... అంటూ వైసీపీ ఆటో యూనియన్ నాయకుడిగా ఉన్న ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పెట్టడం వైరల్‌గా మారింది. సీఎం జగన్ నిర్వహించిన డ్రైవర్ల సమావేశానికి శ్రీకాళహస్తికి చెందిన కార్మి కులు ముఖం చాటేశారు. దీంతో సమావే శానికి రావాలంటూ ఆ నేత సామాజిక మధ్యమాల్లో ఆదేశాలు జారీ చేశారు. 'లైసెన్సుల విషయంలో సహాయం చేశా మని... సమావేశానికి రమ్మంటే అక్కడ ఉన్నాం.. ఇక్కడ ఉన్నామంటూ... అందరూ సాకులు చెప్తున్నారా' అని తన సందే శంలో వాపోయారు. పట్టణంలో ఆటో వాళ్లంతా వెంటనే సమావేశానికి రావాలం టూ ఆదేశించారు. డ్రైవర్లకు సమస్యలు వస్తే తాము సహకరించబోమంటూ పరోక్షంగా హెచ్చరించారు. ఎన్ని ఉపాయా లు ప్రయోగించినా స్థానిక ఆటో డ్రైవర్లు చాలా తక్కువ సంఖ్యలో సమావేశానికి హాజరు కావడం గమనార్హం.

విలేకరిపై దాడి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: సీఎం జగన్ నిర్వహించిన ఆటో డ్రైవర్ల సమావేశం వద్ద వైసీపీ నేత విలేకరిపై దాడికి పాల్పడ్డాడు. బస్సు యాత్రలో భాగంగా తొట్టంబేడు మం డలం పొయ్యి గ్రామం వద్ద పూతల పట్టు - నాయుడుపేట జాతీయ రహదారికి అను కుని ఆటో డ్రైవర్ల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా సమాశం కవరేజ్ కోసం కొందరు విలేకరులు అక్కడికి చేరుకున్నారు. అక్కడ డ్రైవర్ల సమావేశంలో నాటకీయంగా మాట్లాడ బోయేవారికి ఓ యువతి శిక్షణ ఇచ్చింది. ఇది కవర్ చేయబోయిన విలేకరిని ఆమె గమనించింది. వెంటనే విలేకరి సెల్‌ఫోన్ లాక్కొని ఫోటోలను డిలీట్ చేసింది. అదే సందర్భంలో కొందరు వైసీపీ నాయకులు అక్కడినుంచి వెళ్లి పోవాలం టూ హుకుం చేశారు. దాంతో విలేకర్లు వేదిక వద్ద నుంచి కొంత దూరంగా రోడ్డుకు అవతల వైపునకు చేరుకున్నారు. కాసేపటి తర్వాత కొందరు ప్రైవేటు వ్యక్తులు డ్రోన్ కెమెరాతో అరకొరగా ఉన్న జనాన్ని వీడియో తీసే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన ఓ వైసీపీ నాయకుడు డ్రోన్ విజువల్స్ తీస్తున్న ఇద్దరు యువకులను చితక బాదాడు. ఓ విలేఖరి ఆ దాడి వీడియోను చిత్రీకరించబోయాడు. ఇది గమనించిన మరో వైసీపీ నాయకుడు, ముక్కంటి ఆలయ పాలక మండలి మాజీ సభ్యుడు విలేకరి సెల్ ఫోన్ లాక్కుని పిడుగుద్దులు కురిపించాడు. ఆ తర్వాత ఓ ప్రముఖ పత్రికకు చెందిన తొట్టంబేడు పాత్రికేయుడు అని తెలియడంతో వదిలిపెట్టారు.

7న ఉచిత కంటి వైద్యశిబిరం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 4: వరదయ్య పాళెంకు చెందిన డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నైకు చెందిన శంకర నేత్రాల య వారు పెద్దపాండూరు సచివాల యం వద్ద ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కంటి పరీక్షలు నిర్వ హించి అవసరమైన వారికి చెన్నైలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. ఆపరే షన్‌కు ఎంపికైన వారికి ఉచిత భోజన, బస వసతి కల్పించ నున్నారు. కంటి పరీక్షలకు వచ్చేవారు ఆధారు కార్డు, మొబైల్ తీసుకురావాలి. వివరాలకు 9440037819, 9004877879 ఫోన్ నెంబర్లను సంప్రదించాలి.

వలంటీర్‌పై ఈసీకి ఫిర్యాదు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: ఎన్ని కల కోడ్ ఉల్లంఘించి శ్రీకాళ హస్తి పట్టణం 16వ వార్డు పరిధిలో వలంటీర్‌గా పని చేస్తు న్న షేక్ ఖాదర్‌బీ గురువారం సీఎం జగన్‌ను కలిశారు. ఆ ఫోటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు



రేణిగుంట, ఏప్రిల్ 4: రేణిగుంట పట్టణంలో కుక్కల దాడిలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయ పడ్డాడు. ఈ సంఘటన గురువారం ఉదయం చోటు చేసు కుంది. స్థానికుల కథనం మేరకు.. వినాయకనగర్‌లో కాపురం ఉంటున్న ముత్యాలయ్య అనే వృద్ధుడు కొబ్బరినీళ్లు తాగేం దుకు బజారుకు వెళ్లి తిరిగి వస్తుండగా బాలికల పాఠశాల ఎదురుగా కుక్కల గుంపు ఒక్క సారిగా ఆయనపై దాడి చేశాయి. కాళ్లు, చేతులు, కంటి వద్ద కొరికేశాయి. రక్తగాయాలయ్యా యి. స్థాని కులు ఆయన్ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బొజ్జల కుటుంబాన్ని ఆదరించండి

ఏర్పేడు, ఏప్రిల్ 4: వచ్చే ఎన్నికల్లో బొజ్జల కుటుం బాన్ని ఆదరించి గెలిపించాలని శ్రీకాళ హస్తి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి కోరారు. గురువారం పల్లం పంచాయతీలోని పల్లంపేట, పల్లం గొల్లపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. నాయకులు రెడ్డివారి గురవారెడ్డి, నాగేశ్వ రరావు, పొన్నారావు, చంద్రశేఖర్ నాయుడు, రాజకుమార్ నాయుడు, గుణయాదవ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాదయాత్రలో ఇచ్చిన హామీ ఏమైంది జగన్‌రెడ్డీ : టీడీపీ



ఎస్ఎస్‌కెనాల్ వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

తొట్టంబేడు/ ఏర్పేడు, ఏప్రిల్ 4: వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్ఎస్‌కెనాల్ పూర్తిచేస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీ ఏమైంది జగన్‌రెడ్డి అంటూ టీడీపీ నాయకులు ప్రశ్నించారు. శ్రీకాళ హస్తి మండలంలోని గొల్లపల్లి, ఏర్పేడు మండలం చింతల పాళెంలోని ఎస్ఎస్‌కెనాల్ వద్ద గురువారం టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కూడా అప్పట్లో ఎస్ఎస్ కెనాల్ కోసం పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని విమర్శించారు. చంద్రబాబు ఎస్ఎస్‌కెనాల్‌ను తీసుకొచ్చి 80శాతం పనులు పూర్తి చేశారన్నారు. 20 శాతం పూర్తిచేయలేకపోయిన వైసీపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి చెంచయ్యనాయుడు, జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, నాయకులు తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బొల్లినేని జగన్నాథంనాయుడు, పాపిరెడ్డి, కృష్ణాయాదవ్, తిరుమలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏం అభివృద్ధి చేశారని జగన్ ప్రచారానికి వచ్చారు?

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4: శ్రీకాళహస్తి ప్రాంతంలో ఏం అభివృద్ధి చేశారని సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు వచ్చారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన రెడ్డి ఇక్కడి పరిశ్రమల నిర్వాహకుల నుంచి వారి ఆదాయంలో కమీషన్ల రూపంలో వసూలు చేస్తున్నార న్నారు. ముక్కంటి ఆలయం నుంచి ప్రతి నెలా రూ.3కోట్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. రాజీవ్‌నగర్‌లో సుమారు 2వేల ప్లాట్లు కబ్జా చేసి సొమ్ము చేసుకున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసి రూ.కోట్లు దోచుకున్నారన్నారు. ఆయన మళ్లీ గెలిస్తే శ్రీకాళహస్తిలో ప్రజల ఆస్తులు మిగలనివ్వ రన్నారు.

ముస్లింలను కించపరచడం తగదు : సుధీర్‌రెడ్డి

ప్రత్యూష హత్య కేసు నిందితులకు తాను సహకరించానని శ్రీకాళహస్తిలో కొందరు వైసీపీ నేతలు ఆరోపించడం బాధాకర మన్నారు. ఆ సమయంలో తాను అమెరికాలో ఉన్నానని తెలియ జేశారు. తనపై ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తానన్నారు. బియ్యపు మధు ఒకసారి టమోటాలు, కోడిగుడ్లు, చికెన్ పంపిణీ చేసి నిత్యం అదే ప్రచారం చేసుకుంటూ ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నేతలు విజయ కుమార్, చెంచయ్యనాయుడు, మిన్నల రవి, రవీంద్రనాథ రెడ్డి, మునిరాజా నాయుడు, లక్కమనేని మధు, షాకీరాలీ, అస్మత్, బషీర్, పేట బాలాజీ రెడ్డి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూలం అభ్యర్థిత్వంపై నిరసన

సత్యవేడు, ఏప్రిల్ 4 : సత్యవేడు టీడీపీ అభ్యర్థి ఆదిమూలాన్ని తప్పించి కొత్తవారికి టికెట్ ఇవ్వాలని కోరుతూ గురువారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమా వేశం నిర్వహించారు. ఆదిమూలం పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులను, కార్యకర్తలను అక్రమ కేసులతో హింసించారని తెలిపారు. ఆదిమూలంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత వల్ల సునా యాసంగా గెలిచే సీటును చేజార్చుకోవాల్సి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ మస్తాన్, మునస్వామి యాదవ్, గిరిబాబు, ఈశ్వరయ్య, దశరథన్, ఎం.డి.కుమార్, శివకుమార్ నాయు డు, మల్లి నాయుడు, గోవింద్ చౌదరి, ముని సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి, ఉషారాణి, ముని భూషణమ్మ, వినాయకం, శివయ్య, దొరబాబు నాయుడు, వెంకటేష్ యాదవ్, సురేష్ చౌదరి, రాజారెడ్డి, లోకయ్యనాయుడు, హరినాయుడు, లోకేష్ చౌదరి, షణ్ముగం, గోపి, మునివేలు, మునిరాజా, భాస్కర్, ముని సుబ్బయ్య, రాము, కృష్ణమ్మ నాయుడు, చలపతినాయుడు, భాస్కర్‌యాదవ్, కుమార్, హరి నాయుడు, లోకేష్ నాయుడు, చంద్రయ్య పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి: మాజీ ఎమ్మెల్యే హేమలత

ఎమ్మెల్యే ఆదిమూలం చిల్లర రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే హేమలత సూచించారు. ఆదిమూలం గురువారం హేమ లతను ఆమె నివాస గృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆది మూలం గెలుపునకు తాను పనిచేస్తానని, శ్రేణులు కూడా పని చేయాలని పార్టీ శ్రేణులను ఆమెకోరుతున్నట్లు ఆదిమూలం అను చరులు కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇది వివాదంగా మారింది. దీంతో ఆమె స్పందించారు. ఆదిమూలం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ నాయకులు చేపట్టిన కార్యక్రమాన్ని పక్కదోవ పట్టించేందుకే ఇలా చేశారన్నారు.

ఆటోను ఢీకొన్న కారు.. యువకుడి మృతి



రెండు కాళ్లు నలిగిపోయిన యోగానంద్ తీవ్రంగా గాయపడిన రవి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 4: ఆటోను కారు ఢీకొన్న ఘనటలో ఓ యువ కుడు మృతిచెందాడు. మరో యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని కారణిమిట్ట సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. సూళ్లూరుపేట మండలం ఉగ్గుమూడి గ్రామానికి చెందిన యోగానంద్ (35) బీఎన్‌కండ్రిగ మండలం లోని కారణిమిట్ట గ్రామంలోని అత్తగారింటికి గురువారం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తన బావమరిది రవితో కలిసి ఆటోలో వెళ్తుండగా శ్రీకాళహస్తి నుంచి చెన్నైకు వెళు తున్న కారు ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్రగా యాలయ్యాయి. యోగానంద్ రెండు కాళ్లు నలిగిపోయాయి. రవికి కాలు, చేయి విరి గింది. స్థానికులు 108లో శ్రీకాళహస్తి ఆస్ప త్రికి తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరు పతికి తరలించగా అక్కడ యోగానంద్ మృతిచెందాడు. రవి చికిత్స పొందుతున్నా డు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.